ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 3 ఫిబ్రవరి 2026 www.prajaswaramdailly.com 4 PM





# ఘనంగా సావిత్రీ బాయి పూలే జయంతి

**చేగుంట జనవరి 03 (ప్రజా స్వరం)**

చేగుంట మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలె జయంతి ని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను శాలువలతో ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 195 జయంతి సందర్భంగా భారతీయ సంఘ సంస్కర్తగా, మొదటి ఉపాధ్యాయినిగా అనేక సేవలు అందించిందని,ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించడం జరిగిందని ఆమెను కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని నేటి మహిళ లందరూ కూడా ఉన్నత స్థాయిలో ఉండాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా లక్ష్మణ్, చల్లా రామకృష్ణ, సుమతి, రజిని, సుమలత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



# ఇళ్ల మధ్య చెత్తాచెదారం

**మాసాయిపేట జనవరి 03 (ప్రజాస్వరం)**

గ్రామంలో ఇళ్లకు సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోయి పందులు స్వైర విహారం చేస్తున్నట్లు ప్రజలు ఆరోపించారు. చెత్తను విచ్చలవిడిగా వేయడంతో పందులు అక్కడే నివాసముంటున్నట్లు పేర్కొన్నారు. చెత్తాచెదారం, పందుల కారణంగా దోమలు పెరిగిపోయాయని ప్రజలు తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించి, పందులు రాకుండా చూడాలని కోరారు.

# 96 గదులు.. 35.19 కోట్లు

### కొండగట్టుకు పవన్ కల్యాణ్

**ధర్మశాల, దీక్ష విరమణ మండపానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన**

**కొండగట్టు, ప్రజాస్వరం**

ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలంగాణలోని జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. స్వామివారిని దర్శించుకున్న పవన్‌కల్యాణ్‌కు అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను జనసేనానికి ఇచ్చారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కొండగట్టు అంజన్నపై నాకు అపారమైన నమ్మకం ఉందని చెప్పారు. కొండగట్టు అంజన్న నాకు పునర్జన్మ ఇచ్చారని తెలిపారు. విద్యుత్ ప్రమాదం నుంచి ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరడం జరిగిందని అన్నారు. టీటీడీ సభ్యులు, నాయకుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. గిరి ప్రదక్షిణకు రోడ్డు మొదలుపెట్టండి నేను కరసేవ చేస్తానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. కొండగట్టులో ఆంజనేయ భక్తులు దీక్షలు విరమించేందుకు సత్రం నిర్మాణం కోసం



పవన్ కల్యాణ్ టీటీడీ బోర్డుకు లేఖ రాయగా, లేఖను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తే వెంటనే ఆమోదించారని టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. టీటీడీ బోర్డు సమావేశంలో ఈ నిర్మాణాలకు వెంటనే అనుమతి ఇచ్చామన్నారు.

**అనంతరం నాచుపల్లి శివారులోని బృందావనం రిసార్ట్‌లో జనసేన కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. మరోవైపు ఇటీవల జరిగిన గ్రామ సర్పంచి ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచులతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు.**

# వెనెజువెలా.. కరాకస్‌లో భారీ పేలుళ్లు

**మదురోలో.. ఎమర్జెన్సీ**

**యుద్ధ విమానాల గర్జనతో వణికిపోయిన రాజధాని**

**తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఏడు చోట్ల విస్ఫోటనం**

**వెనెజువెలాపై అమెరికా మెరుపు దాడులు**

**వెనెజువెలా, ప్రజాస్వరం**

వెనెజువెలా రాజధాని కరాకస్‌లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఏడు చోట్ల పేలుళ్లు సంభవించాయి. పేలుళ్ల నేపథ్యంలో ప్రజలు భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. వెనెజువెలాలో డ్రగ్స్ సరఫరాను అడ్డుకునేందుకు భూతల దాడులు సైతం చేసేందుకు సిద్ధమని అమెరికా హెచ్చరించిన నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. మిలిటరీ సౌకర్యాలు సహా పలుచోట్ల అమెరికానే ఈ దాడులు జరిపినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా విషయంలో కొంతకాలంగా వెనెజువెలాను అమెరికా లక్ష్యంగా చేసుకుంది. ఇదిలా ఉండగా, అమెరికా దాడులతో అప్రమత్తమైన మదురో ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధిస్తున్నట్లు ప్రకటించింది. డ్రగ్స్‌ను తరలిస్తున్న పడవలపై అమెరికా దాడులు ముమ్మరం చేసింది. డ్రగ్స్ సరఫరాకు వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో సహకరిస్తున్నారని అమెరికా ఆరోపిస్తోంది. డ్రగ్స్ సరఫరాను అడ్డుకునేందుకు వెనెజువెలాలో భూతల దాడులు సైతం చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే తాజా పేలుళ్లు చోటుచేసుకున్నాయి. మరోవైపు అమెరికా ఆరోపణలను మదురో ఖండించారు మాదకద్రవ్యాల అడ్డుకట్టకు అమెరికాతో చర్చించేందుకు సిద్ధమని పేర్కొన్నారు.

### కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన ఒక్క నీటి బొట్టు కూడా వదలం : మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ప్రజాస్వరం**

కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన ఒక్క నీటి బొట్టు కూడా వదలం అని మంత్రి ఉత్తమ్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ విషయంలో వాళ్లేదో గొప్పగా చేసినట్లు, మేము ఏదో తప్పు చేసినట్లు బీఆర్ఎస్ ప్రచారం చేస్తోందన్నారు. గత ప్రభుత్వం కంటే మేము సమర్థవంతంగా నీటి హక్కులను కాపాడుతూ వస్తున్నాం అని అన్నారు. ఇంత కీలకమైన అంశంపై చర్చ జరుగుతుంటే బీఆర్ఎస్ రావకపోవడం దురదృష్టకరం అని అన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీరని అన్యాయం చేసింది గత ప్రభుత్వమేనని విమర్శించారు.

# తూప్రాన్ఎస్సై శివానందంబదిలీ

**సన్మానించిన సిఐ రంగ కృష్ణ**

**తూప్రాన్ జనవరి3 పూర్ణరాజు గౌడ్ ప్రతినిధి(ప్రజాస్వరం)**

తూప్రాన్ పోలీసుసబ్ ఇన్స్పెక్టర్ శివానందం బధిలి కావడంతో తూప్రాన్ సిఐ రంగ కృష్ణ శాలవతో సన్మానించారు గత మూడేళ్ళుగా తూప్రాన్ కు సేవాలందించారని ఇప్పుడు మెదక్ స్పెషల్ బ్రాంచ్ కు బదిలీ పై వెళ్లారు అప్పటివరకు తూప్రాన్ సబ్ ఇన్స్పెక్టర్ గా జ్యోతి ఉంటారని సిఐ రంగ కృష్ణ తెలిపారు ఎస్సై శివనందం మాట్లాడుతూ నాకు సహకరించిన మండల ప్రజలకు అధికారులకు మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు





# ఎన్ కౌంటర్... 15 మంది మావోయిస్టుల మృతి

**దక్షిణ బస్తర్ జిల్లా అడవుల్లో కాల్పుల మోత**

**బీజాపూర్, ప్రజాస్వరం**



ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి మావోయిస్టులపై భద్రతా బలగాలు విరుచుకుపడుతున్నాయి. బీజాపూర్ జిల్లా దక్షిణ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 15 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. దక్షిణ బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న సమాచారం అందడంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఈ క్రమంలో ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో అటవీ ప్రాంతంలో దాగి ఉన్న మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భద్రతా బలగాలు కూడా వెంటనే ప్రతి స్పందించడంతో రెండు వైపులా ఎదురు కాల్పులు జరిగాయి.15 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనాస్థలిలో 3 ఏకే-47 రైఫిళ్లతో పాటు, పలు ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

**కాసేపట్లో డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశం**

కాసేపట్లో డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించనున్నారు. ఆయన ఎదుట బర్సే దేవాతో పాటు మరో 20 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. భారీగా ఆయుధాలు, రూ.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

# అంగన్వాడీ సెంటర్ను పరిశీలించిన సర్పంచ్

**గజ్వేల్ / వర్గల్ జనవరి 03 ప్రజాస్వరం**

మండల కేంద్రంలోని అంగన్వాడి-4 సెంటర్ ను సర్పంచ్ దేవగనిక జయభారతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, అంగన్వాడి సెంటర్లలో బాలింతలకు కావలసిన పాలు, గుడ్లు, బాలామృతం, పోషకహారాలు కలిగినటువంటి వారికి రోగ నిరోధక శక్తిని అందించే డైట్ ను తప్పక అందించి, సుఖ ప్రసవాలు అయ్యే విధంగా ఆహార పదార్థాలు అంగన్వాడి సెంటర్లు అందించాలని, దాంతోపాటు చిన్న పిల్లలకు కూడా సరైనటువంటి ఇమ్యూనిటీ అందించే పోషకాఆహార పదార్థాలను అందిస్తూ వారికి చదువును కూడా అందించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ విధంగా అంగన్వాడి సెంటర్లు బాధ్యతతో పనిచేయాలని సర్పంచ్ పేర్కొన్నారు. అనంతరం అంగన్వాడి టీచర్ దుర్గా సర్పంచ్ కి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వేలూరి కిష్టారెడ్డి,దేవగనిక నాగరాజు, వార్డ్ సభ్యులు మోసిన్, పర్శరాములు మరియు ఆయా, మహిళలు పాల్గొన్నారు